## రేపు తెలంగాణ యువతి మండలి వార్షికోత్సవం

**కాచిగూడ:** తెలంగాణ యువతి మండలి శ్రీమతి ఎ.శ్యామలదేవి మహిళా డిగ్రీ కళాశాల వార్షికోత్సవం ఈనెల 8వ తేదీన సాయంత్రం 4:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ డి.వసుంధర, ప్రిన్సిపాల్ బి.లావణ్యకుమారి తెలిపారు. కళాశాలలో జరిగే ఈ వేడుకకు ముఖ్యఅతిథులుగా హైకోర్టు జడ్జి జస్టిస్ డాక్టర్ డి.రాధరాణి, ఓయూ ఇంగ్లిష్ విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్ పర్సన్ ప్రొ. పరిమల కులకర్ణి, యువతి మండలి అధ్యక్షురాలు ఆర్.పద్మజ మల్లికార్జున్, కార్యదర్శి నివేదితకుమార్ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

## విద్యార్థులు సాఫ్ట్ స్కిల్స్‌ను పెంచుకోవాలి


వివేకానంద డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న వక్త

**ముషీరాబాద్:** విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రిలయన్స్ ఫౌండేషన్, కళాశాల కామర్స్ డిపార్ట్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ఏడు రోజుల నైపుణ్య శిక్షణ తరగతుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభు, ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేంద్రకుమార్, రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. సాఫ్ట్ స్కిల్స్, ఎంప్లాయెబిలిటీ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తారన్నారు. ఈ పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొవడానికి వారి ఉన్నతికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కామర్స్ శాఖాధిపతి డాక్టర్ జె.అనితారాణి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.పద్మజ, కళాశాల కెరియర్ గైడెన్స్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పద్మశాలీయుల డిమాండ్ల సాధనకు కృషి చేస్తా

**ముషీరాబాద్:** రాష్ట్ర పద్మశాలి సంఘం గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్‌గా పి.మల్లేష్ నియమితులయ్యారు. గురువార ఆయనకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వలకటి రాజ్‌కుమార్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భోలక్‌పూర్‌లోని పద్మశాలి సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో మల్లేష్ మాట్లాడుతూ.. గ్రేటర్ పరిధిలోని పద్మశాలి కులస్తులను ఏకతాటిపైకి తీసుకువచ్చి తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు కృషి చేస్తామన్నారు. తనపై నమ్మకం ఉంచి పదవీ బాధ్యతలు అప్పగించిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారులు బాల్‌రాజ్, రమేష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి బింగి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## వెనకబడ్డ కులాలకు 3 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న వేణు

**పంజగుట్ట:** ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలని అదే సమయంలో ఎస్సీ 'ఎ' కేటగిరిలో 15 సంచారజాతులను చేర్చి మూడు శాతం రిజర్వేషన్లు కల్పించాలని బేడ బుడగ జంగం జన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిరిపాటి వేణు విజ్ఞప్తి చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యా, ఉద్యోగం, ఉపాధి, ఆర్థికంగా ముందున్న పంబాల, మన్నే కులాలను ఎస్సీ ఎ కేటగిరి నుంచి తొలగించాలని వారి స్థానంలో వెనకబడ్డ కులాలైన దాసరి, హోలియ దాసరి కులాలను ఎ జాబితాలో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహ, సహదేవుడు, పరుషురాం, వెంకటి, రాజేష్, శివ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

**కాచిగూడ:** రైలు ఢీకొని ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తి (35) ఉప్పుగూడ - యాకుత్‌పుర రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రోడ్డుపైనే ఇసుక వ్యాపారాలు!

- పట్టించుకోని ట్రాఫిక్, జీహెచ్ఎంసీ అధికారులు
- వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**నల్లకుంట:** ప్రధాన రహదారుల్లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మాణాలు, రోడ్లు ఆక్రమించి గృహ నిర్మాణ సామగ్రి విక్రయాలు చేపడుతూ ట్రాఫిక్ సమస్యలు సృష్టిస్తున్నారు. రోడ్డు ఆక్రమణలపై అటు ట్రాఫిక్ పోలీసులు, ఇటు జీహెచ్ఎంసీ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు చెబుతున్నారు. అదే పేదలు బస్తీలలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టే క్రమంలో ఇళ్ల ముందు నిర్మాణ సామగ్రి వేస్తే వెంటనే అక్కడ ప్రత్యక్షమయ్యే జీహెచ్ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు జరిమానాలు విధిస్తూ వేధిస్తుంటారు. కానీ బహిరంగంగా రోడ్లు ఆక్రమించి వ్యాపారులు చేసే వారి నుంచి ముడుపులు పుచ్చుకుంటూ వదిలేయడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


తిలక్‌నగర్ రైల్వే బ్రిడ్జి నుంచి ఫీవర్ ఆస్పత్రికి వచ్చే ప్రధాన దారిలో రోడ్డు పక్కన ఇసుక వ్యాపారాలు

### తిలక్‌నగర్ రైల్వే బ్రిడ్జీ సమీపంలో..

– నల్లకుంట తిలక్‌నగర్ రైల్వే బ్రిడ్జీ సమీపంలో కొందరు రోడ్డును ఆక్రమించి ఇసుక వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఈ రహదారి నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటోంది. ఉదయం వాహనాల రాకపోకలు తక్కువగా ఉన్న సమయంలో భారీ వాహనాల ద్వారా ఇసుకను తీసుకొచ్చి రోడ్డు పక్కనే కుప్పలుగా పోయిస్తుంటారు. చుట్టుపక్కల బస్తీలలో చిన్నచిన్న నిర్మాణాలు చేపట్టే ప్రజలు వారి అవసరాల నిమిత్తం ఇక్కడి నుంచే ఇసుక కొనుగోలు చేస్తుంటారు. ఈ క్రమంలో ఇసుకను ఆటో ట్రాలీలలో తరలించే క్రమంలో ఇసుక రోడ్డుపై పడుతోంది.

### ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలి..

ఈ క్రమంలో వాహనదారులు జారి పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికై నా ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఇసుక వ్యాపారాలు కొనసాగించే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించకుంటే ప్రతి సోమవారం జీహెచ్ఎంసీ సర్కిల్–16లో, హైడ్రా ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదు చేస్తామని వాహనదారులు హెచ్చరిస్తున్నారు.

## నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన


శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ గరిగంటి శ్రీదేవిరమేష్

**నల్లకుంట:** కాంగ్రెస్ నాయకుడు గరిగంటి రమేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని సాధురామ్ ఐ ఆస్పత్రి, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సౌజన్యంతో గురువారం నల్లకుంట సంజీవయ్యనగర్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ నాయకుడు సీహెచ్. భగవాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని నల్లకుంట మాజీ కార్పొరేటర్ గరిగంటి శ్రీదేవి రమేష్ ప్రారంభించి మాట్లాడారు. వైద్యులు సుమారు 125 మందికి నేత్ర పరీక్షలు చేశారు. వారిలో 35 మందికి రెటీనా పూర్తిగా దెబ్బతిన్నదని వారికి కంటి శస్త్ర చికిత్సలు చేయాలని వైద్యులు చెప్పారు. దీంతో శిబిరం నిర్వాహకులు కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని సాధురామ్ ఆస్పత్రికి పంపించారు. శుక్రవారం ఉదయం వారందరికి కంటి ఆపరేషన్లు పూర్తి చేసి ఇంటికి పంపిస్తామని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీవాత్సవ, కాంగ్రెస్ నాయకులు రాజుగౌడ్, హమీద్, రవి, బాబు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.12లక్షల ఆదాయానికి | పన్ను మినహాయింపు హర్షణీయం

**ముషీరాబాద్:** కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాలకు మేలైన బడ్జెట్ అని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. గురువారం ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు కంచికుమార్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో బాపూజీనగర్‌లో ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై హర్షం వ్యక్తం చేస్తూ మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేసే విధంగా బడ్జెట్ రూపొందించారని అన్నారు. రూ.12లక్షల ఆదాయం ఉన్న వారికి పన్ను మినహాయింపు కల్పించడం హర్షణీయమని పేర్కొన్నారు. దీని వల్ల దేశవ్యాప్తంగా ఉద్యోగులు, చిరువ్యాపారులకు, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపశమనం లభించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూస రాజు, సదానంద్ ముదిరాజ్, అనిల్‌కుమార్, సత్యనారాయణ, ఆయుష్, రాజు, లక్ష్మణ్, బాలకృష్ణ, రమేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.


ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆనంద్‌గౌడ్, కంచికుమార్

## హరియాణా గవర్నర్ దత్తాత్రేయకు త్రైత సిద్ధాంత గ్రంథాలు అందజేత

**ముషీరాబాద్:** హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయకు రాంనగర్‌లోని ఆయన నివాసంలో త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి ప్రతినిధులు త్రైత సిద్ధాంత భగవద్గీతను గురువారం అందజేశారు. ఈ గ్రంథాలను యోగీశ్వరులు రచించారు. ఈ గ్రంథంలో ప్రత్యేకంగా 1058 ఆధ్యాత్మిక ప్రశ్నలు, జవాబులు ఉంటాయని సేవా సమితి ప్రతినిధులు అనిల్, తిరుమల్లేష్, కుమార్ తెలిపారు.


హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయకు త్రైత సిద్ధాంత గ్రంథాలు అందజేస్తున్న ప్రతినిధులు

## మంచి ఆలోచనలే విజయానికి సోపానాలు


కాచిగూడ బద్రుక కళాశాల వీధిలో ఫ్లాష్‌మాబ్ చేస్తున్న విద్యార్థులు

**కాచిగూడ:** ఆత్మవిశ్వాసంతో కూడిన మంచి ఆలోచనలే విజయానికి సోపానాలుగా నిలుస్తాయని నాసిక్‌లోని యశ్వంత్‌రావు చవాన్ మహారాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం మాజీ వీసీ ప్రొ. వాయునందన్ అన్నారు. గురువారం కాచిగూడలోని బద్రుకా వాణిజ్య కళాశాలలో రెండు రోజుల అంతర్ కళాశాలల 'బిజ్‌కామ్–2025 మేనేజ్‌మెంట్ ఫెస్ట్'కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడంపై విద్యార్థులు దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమలోని వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవడం, విద్య, సముపార్జనపై దృష్టిని సారించాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం కళాశాల మ్యాగ్జిన్‌ను విడుదల చేశారు. బద్రుకా విద్యాసంస్థల కార్యదర్శి శ్రీకిషన్ బద్రుకా, డైరెక్టర్ జనరల్ ప్రొ. అభిరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ జానకీరామ్, డాక్టర్ వెంకటయ్య, ఫెస్ట్ కన్వీనర్ అనుపమ తదితరులు పాల్గొన్నారు.

## 9న ఉద్యమకారుల భవిష్యత్ కార్యాచరణపై అవగాహన

**చిక్కడపల్లి:** తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ మహిళా వేదిక ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి ప్రఫుల్‌రాంరెడ్డి తెలిపారు. చిక్కడపల్లిలోని జేఏసీ కార్యాలయంలో గురువారం శిక్షణకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించి వారు మాట్లాడారు. ఈ నెల 9వ తేదీన ఆదివారం ఉప్పల్‌లోని పీర్జాదిగూడలో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. తరగతుల్లో ఉద్యమకారుల భవిష్యత్ కార్యాచరణ, రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడులు, మహిళలపై అత్యాచారాలు వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రచయితలు శ్యామల, సుభద్ర, ప్రముఖులు చంద్రన్న ప్రసాద్, ఇందిర, ధనలక్ష్మి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.


జేఏసీ కార్యాలయంలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సుల్తాన్ యాదగిరి, ప్రఫుల్‌రాంరెడ్డి, శ్యామల

## మ్యాన్‌హోల్.. యమ డేంజర్!


చిక్కడపల్లి వివేక్‌నగర్‌లో ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్

**చిక్కడపల్లి:** వివేక్‌నగర్ ఆనంద్ రెసిడెన్సీ రోడ్డులో మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. వాటర్‌వార్క్స్ సీవరేజీ బోర్డు మ్యాన్‌హోల్ కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఏ క్షణాన కుంగిపోయి ప్రమాదం జరుగుతుందోనని వాహనాదారులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ భవన నిర్మాణాలు కొనసాగడంతో భారీ వాహనాలు వస్తున్నాయి. దీంతో మ్యాన్‌హోళ్లు, రోడ్లు ధ్వంసమవుతున్నాయి. రోజులు గడుస్తున్న అధికారులు కానీ ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయంపై అధికారులు ఫిర్యాదు చేశామని చెబుతున్నారు. ఇప్పటికై నా స్పందించి మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

## ప్రజల పక్షాన నిలబడితే నక్సలైట్ ముద్ర వేస్తారా?

**లిబర్టీ:** ప్రజా సమస్యల పరిష్కారం, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఏఐసీసీ మాజీ అధ్యక్షులు, లోక్‌సభ సభ్యులు రాహుల్‌గాంధీ పోరాటం చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం అర్బన్ నక్సలైట్‌గా చిత్రీకరించడాన్ని మాల మహానాడు ప్రధాన కార్యదర్శి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెన్న సదానందు తప్పుపట్టారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడితే నక్సలైట్ ముద్ర వేస్తారా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. జూడో యాత్రతో రాహుల్‌గాంధీకి ప్రజాదరణ పెరిగిందని దాన్ని జీర్ణించుకోలేక కేంద్ర ప్రభుత్వం రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ తట్టుకోలేక అర్బన్ నక్సలైట్‌గా ముద్ర వేసి దెబ్బతీయాలని చూస్తే గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

### 14న తెలంగాణ రాష్ట్ర బంద్

**కాచిగూడ:** తెలంగాణలో ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ ఈ నెల 14న తెలంగాణ రాష్ట్ర బంద్ పాటించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్ రాజు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ పిలుపునిచ్చారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించే ముందు ఎలాంటి రాజ్యాంగ నిబంధనలు పాటించలేదన్నారు. జాతీయ ఎస్సీ కమిషన్‌ను ఆర్టికల్ 338 ప్రకారం సంప్రదించకుండా ఏకపక్షంగా ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం పూనుకుందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ అజెండాను అమలు చేయడంలో భాగంగా ప్రధాని మోదీ ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ సామాజిక డ్రామా రాజకీయ కుట్రలకు పాల్పడ్డారన్నారు. ఈ సమావేశంలో నక్కా దేవేందర్ రావు, గోలి నరేష్, చిపర్తి సుబ్బారావు, బుంగా జయరాజు తదితరులు పాల్గొన్నారు.

## రేపు మత్స్య మహిళా జాతీయ సదస్సు


సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 8వ తేదీన మత్స్య మహిళా జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ, ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ అన్నారు. గురువారం సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా మత్స్య మహిళలకు ఒకే విధమైన సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన బడ్జెట్ కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ జాతీయ సదస్సులో తెలంగాణ రాష్ట్ర మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల చైర్మన్ మెట్టు సాయికుమార్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, హైదరాబాద్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ కొప్పు పద్మ తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ బ్రోచర్ ఆవిష్కరణలో హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ముఠా విజయ్‌కుమార్, మహిళా రాష్ట్ర నాయకులు బక్కి బాలమణి, చంద్రి పుష్ప, కుంట పుష్పలత, కర్రెల్లి నవనీత, బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### సామాజిక సాధికారత సాధనలో
## సీఎం రేవంత్‌రెడ్డి దేశానికే ఆదర్శం

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గుంజ శ్రీనివాస్



**కాచిగూడ:** రాష్ట్రంలో కుల గణన నిర్వహించి దేశ చరిత్రలో బీసీలను గుర్తించడమే కాకుండా వారిని రాజ్యాధికారం వైపు నడిపిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గుంజ శ్రీనివాస్ అన్నారు. గురువారం నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ, వడ్డెర సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ సామాజిక అన్యాయానికి పాల్పడగా నేటి సీఎం రేవంత్‌రెడ్డి ఆయా వర్గాల సాధికారత కోసం నిబద్ధతతో అడుగులేస్తున్నారని అభినందించారు. సామాజిక సాధికారత సాధనలో సీఎం రేవంత్‌రెడ్డి దేశానికే ఆదర్శమని తెలిపారు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా బీసీ కులగణన చేపట్టి దశాబ్దాల కాలంగా వెనుకబాటుకు గురైన బీసీల అభ్యున్నతికి సీఎం కృషి చేస్తున్నారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ప్రకారం అధికారం చేపట్టిన ఏడాదిలోపే కులగణనకు శ్రీకారం చుట్టడమే కాకుండా 52 రోజుల పాటు అత్యంత శాస్త్రీయంగా కులగణన చేపట్టి పూర్తి చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనని అన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసే దిశగా చర్యలు తీసుకోవడమే కాకుండా ఒకవేళ న్యాయస్థానాల్లో చట్టపరమైన చిక్కులు ఎదురైతే ప్రస్తుతానికి పార్టీ పరంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని అసెంబ్లీ వేదికగా సీఎం ప్రకటించారని అన్నారు.

## నిబంధనల ప్రకారమే ఫీజులు వసూలు చేస్తున్నాం


ముషీరాబాద్ మండలం ట్రస్మా నూతన కార్యవర్గంతో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఫీజులు వసూలు చేస్తున్నామని తెలంగాణ గుర్తింపు పాఠశాలల సంఘం(ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్, కార్యదర్శి రమేష్ తెలిపారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ముషీరాబాద్ మండలం ట్రస్మా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ... ప్రాథమిక స్థాయి నుంచే నాణ్యమైన విద్యను అందిస్తే విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకుంటారని అన్నారు. అనంతరం ట్రస్మా ముషీరాబాద్ మండలం నూతన అధ్యక్షుడు అహ్మదుల్లా భక్తియారి, ప్రధాన కార్యదర్శిగా అంకం శ్రీనివాస్, కోశాధికారి టి.మురళీధర్‌రావు, ఉపాధ్యక్షులుగా ఎస్.సంజీవులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ముషీరాబాద్ మండలం ఉప విద్యాధికారి శ్రావణ్‌కుమార్, రిటైర్డ్ డిప్యూటీ ఈవో చిరంజీవి, డిప్యూటీ ఐవోఎస్‌లు స్వరూపారాణి, జయలక్ష్మి తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర కోశాధికారి రాఘవేంద్రారెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రావు, మాజీ అధ్యక్షుడు రఘుమంచాల, ఎరిశెట్టి ప్రకాష్, ఈసీ మెంబర్ కమటం రఘు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం.. | సామాన్యుడి వజ్రాయుధం

**కాచిగూడ:** సమాచార హక్కు చట్టం సమాన్యుడి చేతిలో వజ్రాయుధం లాంటిదని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్ అన్నారు. గురువారం బర్కత్‌పురలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గోపినాథ్‌ను ఎన్నుకుని నియామకపు పత్రాన్ని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చంటి ముదిరాజ్ మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం 2005ను ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పక్బందీగా అమలు చేయాలన్నారు. ఆర్‌టీఐ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు కోరిర సమాచారాన్ని 30 రోజుల్లోపు ఇవ్వాలని సూచించారు. వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగినప్పుడు, ప్రాణహాని ఉన్నప్పుడు కేవలం 48 గంటలలో సమాచారం అధికారులు ఇవ్వాలని అన్నారు.

- ప్రజలతో పాటు అధికారులు కూడా ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో దరఖాస్తు చేసుకొని 30 రోజుల్లో సమాచారం తీసుకోవచ్చని తెలిపారు. ఈ చట్టాన్ని ప్రజా ప్రయోజనాల నిమిత్తం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ చట్టాన్ని దుర్వినియోగం చేయొద్దని కోరారు. అవసరమైన సమాచారం మేరకే ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం తీసుకోవాలని సూచించారు. ఈ చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిని బయటకు తీయాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లం వెంకటేశంగౌడ్, బత్తుల మహేష్‌గౌడ్, దీపక్ కులకర్ణి, పందుల రాజుగౌడ్, కె.రామయ్య తదితరులు పాల్గొన్నారు.


సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపినాథ్‌తో డా. చంటి ముదిరాజ్

## రాజ్యాంగ విరుద్ధమైన వర్గీకరణ చేయడం సరికాదు

**లిబర్టీ:** రాజ్యాంగ విరుద్ధమైన వర్గీకరణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంటుందని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్ వి.ఎల్.రాజు ఆరోపించారు. రాజ్యాంగ విరుద్ధమైన ఏబీసీడీ వర్గీకరణకు తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదముద్ర వేయటాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. గురువారం మాల మహానాడు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జస్టిస్ షమీం సారథ్యంలోని ఏకసభ్య కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించడం నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించడం అంటే రాజ్యాంగ వ్యతిరేక చర్య అన్నారు. గతంలో నాలుగు గ్రూపులుగా ఉంటే ప్రస్తుతం మూడు గ్రూపులుగా రిజర్వేషన్ అమలు చేయాలని కమిషన్ నివేదిక ఇవ్వటాన్ని తప్పుపట్టారు. మాదిగలకు 9 శాతం, మాలలకు ఐదు శాతం ఇతర ఉపకులాలకు ఒక శాతం రిజర్వేషన్లు కల్పించాలని కమిషన్ నివేదికలో పేర్కొందని ప్రభుత్వం ఆ దిశగా అమలు చేసేందుకు కసరత్తులు చేస్తుందని ఆరోపించారు. రాజ్యాంగంలోని 341 ప్రకారం వర్గీకరణ చెల్లదని స్పష్టంగా పేర్కొన్నప్పటికి రాజ్యాంగ విరుద్ధంగా వర్గీకరణ చేసి రాష్ట్ర ప్రభుత్వం లక్షలాది మాలలకు ద్రోహం చేసిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం మాలలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటుందని రానున్న రోజుల్లో గుణపాఠం తప్పదన్నారు.


మాట్లాడుతున్న వి.ఎల్.రాజు